క్లుప్తంగా

నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజపురం పంచాయతీ లక్ష్మీపాళెం గ్రామంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన స్వామివారి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఇందులో భాగంగా తొలుత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు సుందరంగా అలంకరించి కళ్యాణ వేదికపైకి చేర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి వారిని గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, శ్రావణ్, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా జాతర

పోరుమామిళ్ల : స్థానిక రంపాడు రోడ్‌లోని కోట పోలేరమ్మ జాతర రెండవరోజు శనివారం వైభవంగా జరిగింది. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. తులసి సుధాకర్ కుటుంబం ఆనవాయితీగా అమ్మవారికి పట్టుచీరలు, వస్త్రాలు, పసుపు, కుంకుమ, బియ్యం, బెల్లం, పండ్లు, పూలు ఊరేగింపుగా తీసుకొచ్చి పోలేరమ్మకు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానానికి నాగేంద్ర రూ. 50 వేలు అందజేశారు. కోలాటం ప్రజలను అలరించాయి.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కలసపాడు : ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, ఓర్పు, సహనం కలిగి చదివినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మండల విద్యాశాఖాధికారి మస్తాన్‌వలి తెలిపారు. శనివారం స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లిషు మీడియం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

ఖాజీపేట : హామీల అమలులో రాష్ట్రంలోని కూటమి విఫలమైందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంత్రి పవన్‌కల్యాణ్ విమర్శించడం తగదని హితవుపలికారు. జగన్‌కు ప్రజాబలం ఉందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక సృజన్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వికసిత ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ సిద్దేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తమ హక్కుల గురించి, బిజినెస్ మార్కెటింగ్ వ్యవస్థ గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, జ్యోతి, డ్యాన్సర్ మహి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

గోపవరం : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థినులకు బొమ్మన ఫౌండేషన్ సహకారంతో శనివారం పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. బొమ్మన ఫౌండేషన్ డైరెక్టర్ బొమ్మనవిజయ్, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



గంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గంగమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శనివారం చిన్నసింగనపల్లె గ్రామంలోని ఆమె నివాసానికి వెళ్లి గంగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, సంగన హరినాథరెడ్డి, ఈ. పద్మనాభరెడ్డి, ఎం.శివశంకర్‌రెడ్డి, మాబుషరీఫ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అట్లూరు : అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్‌బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిర్మాణం పూర్తి కాని ఇళ్లు పూర్తి చేసుకునేందుకు ఎస్సీ, బీసీలకు అధనంగా రూ.50 వేలు అలాగే ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం అధనంగా ఇస్తోందని లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



చాపాడు: లక్ష్మీపేటలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

బ్రహ్మంగారిమఠం : ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని బి.మఠంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్లాస్టిక్ వినియోగిస్తే కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీలు, వ్యవసాయశాఖ, ఉపాధి, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

దువ్వూరు : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పట్ల అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో చింతకుంట గ్రామంలో మండల స్థాయి అధికారులు, పాఠశాలల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. హౌసింగ్ డీఈ రమేష్ బాబు, ఎంఈఓ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాపాడు : సమాజంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో మూడో శనివారం పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో కలసి ప్రభుత్వ ఉద్యోగులందరూ పరిశుభ్రతపై ప్రజలకు చైతన్యం కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ప్రభుత్వం పరిశుభ్రత కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని, దీని కోసం ప్రతి మూడో శనివారం ప్రభుత్వ యంత్రాంగం అంతా గ్రామంలో పర్యటించి పరిశుభ్రత కోసం పాటించాల్సిన పద్ధతుల గురించి తెలియజేస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి మ్యాగీ, ఎంఈఓ వంశీకృష్ణ, డ్వాక్రా ఏపీఎం శ్రీధర్, స్వచ్ఛభారత్ మండ కోర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయ ఆవరణలో..

పోరుమామిళ్ల : స్థానిక అటవీశాఖ కార్యాలయ ఆవరణలో శనివారం రేంజర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పిచ్చిమొక్కలు తొలగించి, చెత్తా చెదారం ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



దువ్వూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణయ్య, అధికారులు, విద్యార్థులు



బ్రహ్మంగారిమఠం: ఉపాధి కార్యాలయం దగ్గర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వైభవంగా అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామ సమీపాన సగిలేరు ఒడ్డున వెలసిన మున్నెల్లి అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్యంగా అమ్మవారిని దర్శించుకునేందుకు బి.కోడూరు మండలం నుండే కాకుండా పోరుమామిళ్ల, బి.మఠం మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టమటంవారిపల్లె, తువ్వపల్లె, బోడుగుండుపల్లె, రాజుపాలెం గ్రామాలకు చెందిన సుడిబండ్లు, నగదా బండ్లు, కుంకుమ బండ్లు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కులుకుభజన, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు. బి.కోడూరు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సుడిబండి

రసవత్తంగా బండలాడుగు పోటీలు

మున్నెల్లి అంకాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాడుగు పోటీలను ఆలయ ధర్మకర్త ఓ.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా బండికురవ గ్రామానికి చెందిన వీరాస్వామిచౌదరికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.50 వేలు, నంద్యాల జిల్లా పెరసవాయి గ్రామానికి చెందిన సయ్యద్‌కలాంబాషకు చెందిన వృషభాలు రెండవ బహుమతి రూ.20 వేలు, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట జె.సి.అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు మునిస్వామికి చెందిన వృషభాలు మూడవ బహుమతి రూ.10 వేలును గెలుచుకున్నాయి. ఈ బహుమతులను ఆలయ ధర్మకర్తల చేతుల మీదుగా వృషభ యజమానులకు ప్రదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ

శాశ్వత కల్యాణ ఉభయ దాతలకు ఆహ్వానం

బ్రహ్మంగారిమఠం : శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో వీరబ్రహ్మేంద్రుడి నిత్య కల్యాణ మండపం సిద్ధమైనట్లు మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. దేవస్థానం నిధులతో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో నిత్యం కల్యాణం కోసం దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీమాతాగోవిందమాంబ సమ్మేత వీరబ్రహ్మేంద్రుడి మాస కల్యాణ మహోత్సవం ప్రతినెల శుద్ధ ద్వాదశి రోజున నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. శాశ్వత కల్యాణం చేయించాలంటే రూ 1,00,116 చెల్లించి శాశ్వత ఉభయ దాతలుగా చేరాలని కోరారు. ఏపీజీవీ గ్రామీణ బ్యాంక్ ఐఎఫ్‌సీ కోడ్ ఏపీజీవీ 0002033 ఖాతా నంబర్ 19129001646, ఎస్‌బీఐ ఐఎఫ్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0012672 ఖాతా నంబర్ 30830543596, యూనియన్ బ్యాంక్ యూబీఐఎన్ 0828611 ఖాతా నంబర్ 286110100004137లో జమచేయవచ్చని పేర్కొన్నారు. దాతలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బ్రహ్మంగారిమఠంలో వీరబ్రహ్మేంద్రుడి నిత్యకల్యాణానికి సిద్ధమైన కల్యాణ మండపం

తెలుగు సాహితీయాత్రలు విజయవంతం

గోపవరం : తెలుగుభాషా వికాస ఉద్యమం, మొల్ల సాహితీపీఠం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన తెలుగు సాహితీ యాత్రలు విజయవంతమయ్యాయని సంస్థల అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ గానుగపెంటహనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్‌లు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలపై ప్రజల్లో, విద్యార్థుల్లో ప్రేమాభిమానాలు, మమకారం పెంచేందుకు ఈ యాత్రలు నిర్వహించామన్నారు. ఈ నెల 7న మొల్ల జన్మస్థలి గోపవరంలో ప్రారంభించి జిల్లా వ్యాప్తంగా యాత్రలు ద్విగ్విజయంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, పద్యపోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశామన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రొద్దుటూరు రూరల్ : మహిళలు బ్యాంకు రుణాలు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. మండలంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న వెలుగు కార్యాలయంలో శనివారం ప్రొద్దుటూరు, దువ్వూరు, చాపాడు, రాజుపాళెం, మైదుకూరు మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లకు, ఏపీఓలకు, వెలుగు సీసీలకు బ్యాంకు లింకేజీ రుణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో గ్రూప్‌నకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.20 లక్షల రుణాలు మంజూరవుతున్నాయన్నారు. ఈ రుణాల మంజూరులో బ్యాంకు అధికారులు, వెలుగు అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. ఫేక్ స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించకుండా ఆన్‌లైన్‌లో కోడ్ ఉన్న సంఘాలకు మాత్రమే రుణాలు మంజూరు చేయాలన్నారు. మహిళలు వ్యాపారం చేసుకోవడానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా వ్యక్తిగత రుణాలను అందిస్తున్నామన్నారు. ఎల్‌డీఎం జనార్దన్‌రెడ్డి, నాబార్డు ఏజీఎం విజయవిహారి, బ్యాంకు లింకేజీ డీపీఎం ధనుంజయ్, ఏపీఎంలు వెంకటసుబ్బమ్మ, వేణుగోపాల్, శ్రీధర్, సుజాత, జయరాజ్, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్

దుస్తుల పంపిణీ

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్లలోని చిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు చేయూత నివ్వాలన్న ఉద్దేశ్యంతో సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయాలి

ప్రొద్దుటూరు రూరల్ : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని డీపీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ప్రజల నుంచి చెత్తను సేకరించేటప్పుడు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. చెత్త నుండి సేంద్రీయ ఎరువులను తయారు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ప్రజలు సేంద్రీయ ఎరువులను తయారు చేసుకుని ఇంటి వద్దే మొక్కలను, కూరగాయల తోటలను పెంచుకుని నాణ్యమైన కూరగాయలను పొందవచ్చన్నారు. డీఎల్‌పీఓ తిమ్మక్క, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకుందాం

ఖాజీపేట : మన ఇంటితో పాటు మన గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకునేందుకు అందరూ కలసి పనిచేద్దామని పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం భూమాయపల్లె గ్రామంలో స్వచ్ఛ గ్రామంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖాజీపేట బస్టాండ్ కూడలిలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.



ప్రొద్దుటూరు రూరల్ : ర్యాలీలో డీపీఓ, సర్పంచ్, అధికారులు

చెత్తను మున్సిపల్ కార్మికులకే అందించాలి

ప్రొద్దుటూరు : ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకుండా మున్సిపల్ కార్మికులకే అందించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం స్థానిక తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్తను కార్మికులకు ఇచ్చేటప్పుడు తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ దస్తగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎస్.నూర్‌బాష, వి.సుబ్బరాయుడు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను బహిష్కరిద్దాం

పోరుమామిళ్ల : ప్లాస్టిక్ వస్తువులు బహిష్కరించి సమాజాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ రమణారెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడవ శనివారం మండలంలోని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. రంగసముద్రం పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ మాట్లాడారు. సమావేశంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీయం బాషా మాట్లాడుతూ ప్లాస్టిక్ అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కో ఆప్షన్ మెంబర్ ఇస్సాక్, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున



పోరుమామిళ్ల: గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణారెడ్డి

మహిళకు రక్తదానం

పోరుమామిళ్ల : ఓఎల్ఎఫ్ ఆసుపత్రిలో చికిత్సకు చేరిన వడ్డమానుకు చెందిన వెంకటసుబ్బమ్మకు బి-పాజిటివ్ రక్తాన్ని శనివారం రంగసముద్రం ఎంపీటీసీ రమణ ఇచ్చారు.

పది పరీక్షలకు అంతా సిద్ధం

- రేపటి నుంచి ప్రారంభం
- మైదుకూరులో 1,239 మంది అభ్యర్థులు



పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు

మైదుకూరు : మైదుకూరు మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలో 7 ప్రభుత్వ హైస్కూళ్లలో 429 మంది, మూడు గురుకుల పాఠశాలల్లో 118 మంది, 19 ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 692 మంది మొత్తం 1,239 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలురు 612 మంది, బాలికలు 627 మంది ఉన్నారు. మైదుకూరు పట్టణం, మండలంలోని అభ్యర్థులందరికీ మైదుకూరులో 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు


పదో తరగతి విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చు. పాఠ్యాంశాలను బట్టి పట్టే దానికంటే పలుమార్లు చదవడం వల్ల పాఠ్యాంశంపై అవగాహన ఏర్పడి అందులో నుంచి ఇచ్చే ప్రశ్నలకు సులువుగా జవాబులు రాసేందుకు వీలుంటుంది.

చక్కటి చేతిరాత ప్రభావం చూపుతుంది

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు రాసే జవాబులు చక్కటి చేతి రాతతో ఉంటే మార్కులపై ఎంతో ప్రభావం చూపుతుంది. అర్థం కాని విధంగా, గజిబిజిగా రాయకుండా, గుండ్రటి అక్షరాలతో పరీక్ష పేపర్లను దిద్దే వారికి బాగా అర్థమయ్యే రీతిలో ఉంటే మంచి మార్కులు వచ్చే అవకాశం ఎంతో ఉంది. జవాబుల్లో ఎక్కువ కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. కొట్టివేతలు ఉన్నా ఒకే గీతతో కొట్టివేస్తే మంచిది.

అయ్యవార్లకు అగ్ని పరీక్ష

- నూరు శాతం ఉత్తీర్ణత ఉండాలని ఉన్నత అధికారులు ఆదేశం
- కాపీయింగ్‌కు సహకరించే ఇన్విజిలేటర్లపై క్రిమినల్ కేసులు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

బద్వేలు : పదవ తరగతి పరీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టాలకు శ్రీకారం చుడుతోంది. దీంతో పదవ తరగతి పరీక్షలు ఈ ఏడాది ఇన్విజిలేటర్లకు అగ్నిపరీక్షగా మారనున్నాయి. పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు సహకరించి నట్లు ఏ మాత్రం ఆధారం లభించినా సంబంధిత ఇన్విజిలేటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు 1997లో అప్పటి ప్రభుత్వం రూపొందించిన యాక్ట్ 25ని తెర ముందుకు తెచ్చారు. ఇన్విజిలేటర్ల సహకారంలో చాల పరీక్షా కేంద్రాల్లో ప్రైవేట్ పాఠశాలల వారు అక్రమాలకు తెరలేపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ యాక్ట్ ప్రకారం పరీక్షా కేంద్రాల్లో చూసి రాతలను ప్రోత్సహించినా, చిటీలు పెట్టి పరీక్షలు రాయించినా బాధ్యులైన ఇన్విజిలేటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల నుంచి ఐదేళ్ల జైలు శిక్ష..రూ.5 వేల నుంచి రూ.5 లక్షల వరకూ జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే రెండున్నర దశాబ్దాల కాలం నాటి జీవోను బయటికి తీసి ఇన్విజిలేటర్లను ఇబ్బందిపెట్టే ఈ జీవోపై ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పరీక్షల్లో అక్ర మాలకు కళ్లెం వేసేందుకే ఈ జీవో అమలు చేస్తున్నామని ప్రభుత్వం పేర్కొంటున్నా కనుమరుగైన యాక్ట్‌ను ఇప్పుడు వెలుగులోకి తేవాల్సిన అవసరమేముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఆయా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. బి.కోడూరు, బి.మఠం, కమలాపురం, ప్రొద్దుటూరు, పులివెందుల పట్టణాల్లో పలు పరీక్షా కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే ఆయా ఏర్పాట్లల్లో అధికారులు తల మునకలై ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 161 పరీక్షా కేంద్రాల్లో 27 వేల 300 మంది రెగులర్ విద్యార్థులు,1500 మంది సప్లమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకు అవసరమైన 1850 మంది ఇన్విజిలేటర్లను ఉన్నత పాఠశాలల నుంచి మరియు ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి స్కూల్ అసిస్టెంట్లను, యస్‌జిటి ఉపాధ్యాయులను ఎంపిక చేశారు.అలాగే ఈరోజు ఒక పరీక్షా కేంద్రంలో ఉన్న ఇన్విజిలేటర్ రేపు అదే పరీక్షా కేంద్రంలో ఉండకపోవచ్చు. 2023 నుంచి పరీక్షల నిర్వహణ పద్ధతిని మార్చివేసింది. ఇప్పుడు సైన్సు శాస్త్రం సబ్జెక్ట్‌కు రెండు పేపర్ల తప్ప మిగిలిన ఐదు సబ్జెక్ట్‌లకు 100 మార్కులకు ఒకే పేపర్ విధానాన్ని అమలు లోకి తెచ్చింది. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ నిధులతోనే నిర్మాణాలు చేపట్టాలి

కాశినాయన : జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆశ్రమంలోని నిర్మాణాలను అటవీశాఖ అనుమతులు లేవని కూలగొట్టిన నిర్మాణాలను ప్రభుత్వ నిధులతో తిరిగి నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎస్.డి.విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం జ్యోతిక్షేత్రంలో అటవీ అధికారులు కూల్చివేసిన కట్టడాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవధూతగా పేరు పొందిన కాశినాయన పేరున రాయలసీమతో పాటు పలు రాష్ట్రాల్లో ఆశ్రమాలు నెలకొల్పి అన్నదానం చేస్తున్నారని అన్నారు. అనంతరం కాశినాయన ఆశ్రమ నిర్వాహకులు చెన్నారెడ్డితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు డాక్టర్ అన్వర్, ఓబీసీ బద్వేలు నియోజకవర్గ చైర్మన్ గుర్రప్ప, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాశినాయన ఆశ్రమంలో కూల్చివేసిన కట్టడాలను పరిశీలిస్తున్న విజయజ్యోతి

పోరుమామిళ్ల : కాశినాయన జ్యోతిక్షేత్రంలో ఫారెస్టు అధికారులు కూల్చివేసిన అన్నసత్రాలు, గోశాల, ఇతర కట్టడాలను శనివారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు నారోజు రమణాచారి మాట్లాడుతూ ఓ ఆధ్యాత్మిక సేవాకేంద్రంలో భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా నిర్మాణాలు కూల్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల మండల నాయకులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ యూనిట్లు పెంచాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు శనివారం బీసీ కార్పొరేషన్ రుణాల యూనిట్లను పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మునిసాయి, ప్రొద్దుటూరు నియోకవర్గ ఇన్‌చార్జి నరేష్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 20 వేల మంది బీసీ నిరుదుద్యోగులున్నారని, కేవలం 124 యూనిట్లు కేటాయించడం ఎంత వరకు న్యాయమని అన్నారు. వీటికి 3 వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. బీసీ జనాభా ప్రాతిపదికన నిధులంటే ఇదేనా అని ప్రశ్నించారు. అదనంగా మరో 2 వేల యూనిట్లను కేటాయించి, బీసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు

విత్తనశుద్ధి తప్పనిసరి

అట్లూరు : రైతులు పంటలను సాగు చేసేటప్పుడు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. శనివారం బద్వేలు మండలం అబ్బుసాహెబ్‌పేట గ్రామంలోని నారిబోయిన విజయశేఖర్ అనే ప్రకృతి వ్యవసాయ కార్యకర్త, రైతు పొలంలో పీఎండీఎస్ (ప్రీమానుసూన్ డ్రై సోయింగ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి, ఘన జీవామృతం, బంకమన్ను తదితర పదార్థాలు ఉపయోగించి సీడ్ పెల్లటైజేషన్ (విత్తన గుళికలు) చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పీఎండీఎస్ నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

వ్యక్తిగత వ్యవసాయ ఆధారిత పనిముట్లు 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. అసక్తి గల రైతులు పూర్తి వివరాలకు సమీప రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

కాశినాయన ఆశ్రమాలు కూల్చడం దుర్మార్గం

మైదుకూరు : అవధూత కాశినాయన ఆలయ ప్రాంగణంలోని అన్నదాన ఆశ్రమాలను కూల్చడం దుర్మార్గమని సీపీఎం మండల కమిటీ నాయకుడు దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జ్యోతి క్షేత్రంలో ఉన్న కట్టడాలు కూల్చి లక్షలాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారని అన్నారరు. కట్టడాలను కూల్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నదాన సత్రాన్ని సొంత డబ్బులతో తిరిగి నిర్మిస్తానని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు.